సాక్షి
పెద్దపల్లి
సోమవారం, 7, అక్టోబర్, 2024

మడిపల్లిలో తమన్నా సందడి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ప్రముఖ హీరోయిన్ తమన్నా భాటియా మడిపల్లి శివారు హుస్సేనిమియా వాగు సమీపంలో ఆదివారం జరిగిన సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఓదెల సినిమా దర్శకుడు సంపత్ నంది తాజాగా ఓదెల-2 సినిమా నిర్మిస్తున్నారు. ఇందుకోసం వాగు సమీపంలోని కాశీమహావిశ్వేశ్వర స్వామి ఆలయంలో తమన్నాతోపాటు పలువురు నటీనటులపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. సినిమా షూటింగ్ తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి అభిమానులు భారీసంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.




న్యూస్‌రీల్

ఓసీపీ-1 తనిఖీ



అధికారులతో డీడీఎంఎస్ రాజీవ్‌ఓంప్రకాశ్‌వర్మ

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-3 పరిధిలోని ఓసీపీ-1 సీహెచ్‌పీని ఎలక్ట్రికల్ డీడీఎంఎస్ రాజీవ్‌ఓంప్రకాశ్‌వర్మ ఆదివారం తనిఖీ చేశారు. ప్రాజెక్టు వ్యూపాయింట్ సందర్శించారు. ఓసీపీ-1 విస్తరణ కోసం ప్రతిపాదనలు, సర్వే ఏరియాను మ్యాప్‌ద్వారా పరిశీలించారు. బొగ్గు వెలికితీత పనులపై ఆరా తీశారు. అనంతరం ఫేజ్ -2 విద్యుత్ సబ్‌స్టేషన్ భిలాయి ఫీడర్, ఫేజ్-1 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తనిఖీలు చేశారు. రక్షణపై అవగాహన, నైపుణ్యం పెంపొందించేందుకు ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, మేనేజర్ ఉదయ్‌హరిజన్, ఏరియా ఇంజినీర్ విజయశేఖర్‌బాబు, ప్రాజెక్టు ఇంజినీర్ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుపై శ్రద్ధ



సూచనలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

పెద్దపల్లిరూరల్: గ్రామపంచాయతీల్లో ఆస్తి పన్ను వసూలుపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. అప్పన్నపేటలో ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులను ఆదివారం ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఆస్తిపన్ను వసూలు లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ కోసం అందిన దరఖాస్తులను ఈనెల 10వ తేదీ వరకు పరిష్కరించాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు స్పందించకపోతే షార్ట్‌ఫాల్ పెట్టి తిరస్కరించాలని అన్నారు. పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి వేరు చేయాలని సూచించారు. పల్లెల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. డీఎల్‌పీవో వేణుగోపాల్, కార్యదర్శి శ్రీలత తదితరులు ఉన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

పెద్దపల్లిరూరల్: గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ ఆదివారం తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల ఉద్యోగులు, కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మిల్లర్ల సమస్య పరిష్కరించాలి




ఎమ్మెల్యే విజయరమణారావుకు వినతిపత్రం అందిస్తున్న రైస్‌మిల్లర్లు

సుల్తానాబాద్/ఎలిగేడు(పెద్దపల్లి): తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్, రైస్‌మిల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మోరపల్లి తిరుపతిరెడ్డి, నగునూరి అశోక్‌కుమార్ కోరారు. వీరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయరమణారావును ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. సీఎంఆర్ విషయంలో రాష్ట్రప్రభుత్వం ఇబ్బందుల గురిచేస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి, సివిల్ సప్లయ్ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. ప్రతినిధులు ముస్త్యాల రాజన్న, పల్లా శ్రీనివాస్, చీటి కేశవరావు, మాడూరి ప్రసాద్, జయపాల్‌రెడ్డి, జనార్దన్, శ్రీనివాస్‌రెడ్డి, సముద్రాల ధర్మేందర్, మినుపాల ప్రకాశ్‌రావు, మారుతి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న భక్తులకు సౌకర్యాలు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి దర్శనం కోసం తరలివచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించామని ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ అన్నారు. మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం ఏర్పాటు చేసిన పాలకవర్గం చివరి సమావేశంలో చైర్మన్, పాలకవర్గం మాట్లాడారు. తమ హయాంలో భక్తుల సౌకర్యార్థం కోనేరు నిర్మించామని చెప్పారు. బంగారుపోచమ్మ, మదనపోచమ్మ ఆలయాలతోపాటు ఎన్ఆర్ఐ సాయంతో వీరభద్రస్వామి ఆలయం నిర్మించామన్నారు. భక్తులకు వసతి కల్పించేందుకు అదనపు గదులు అందుబాటులోకి తీసుకొచ్చామని, రథం సౌకర్యం కల్పించామని, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి సంబంధిత శాఖల అధికారుల నుంచి అనుమతి కోసం విన్నవించామని వివరించారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మురికి కూపాలు



స్వప్నకాలనీలో..



పోలీస్‌స్టేషన్ ప్రహరీ వద్ద..



శాస్త్రీనగర్ వద్ద రాజీవ్ రహదారిని ఆనుకొని..

సుల్తానాబాద్ మున్సిపల్ ఏరియాలో మురుగునీటి కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షం కురిస్తే రోడ్లపై వరద ఏరులై పారుతోంది. ఏళ్లక్రితం నిర్మించిన డ్రైనేజీలు మరమ్మతులు లేక శిథిలమయ్యాయి. మురుగునీరు పారే దారిలేక ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. పందులు, కుక్కలు, ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారాయి. కాలువలు దుర్గంధం వెదజల్లడం, దోమలు దాడులు చేయడంతో బల్దియావాసులు వ్యాధుల బారినపడుతున్నారు. కాలనీలు, గల్లీలతోపాటు ప్రధాన కూడళ్లలోనూ పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు. పట్టణంలోని పలు కాలనీల్లో అధ్వానంగా తయారైన డ్రైనేజీలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పల్లెకు భోజనం

- టీ, టిఫిన్లు కూడా..
- రుచి, శుచి, శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- గ్రామీణుల ఆకలి తీర్చడం లక్ష్యం
- మహిళా సంఘాలే నిర్వాహకులు
- వారికి కూడా ఉపాధి మెరుగు ధ్యేయం
- జిల్లాలో నాలుగు క్యాంటీన్ల ఏర్పాటుకు డీఆర్డీవో అధికారుల చర్యలు
- త్వరలోనే ప్రారంభించేందుకు యంత్రాంగం సన్నాహాలు



శిక్షణ పొందుతున్న స్వశక్తి మహిళలు(ఫైల్)



సర్టిఫికెట్లతో సుల్తానాబాద్ క్యాంటీన్ మహిళలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): తమ అవసరాలు, వివిధ పనుల కోసం మండల కేంద్రాలకు వచ్చే పల్లెవాసుల ఆకలి తీర్చడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఇదేసమయంలో మహిళా సంఘాలకు మరింత మెరుగైన ఉపాధి కల్పించడం, ఆర్థికాభివృద్ధి సాధించడం ధ్యేయంగా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే జిల్లాలో నాలుగు క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు. తొలివిడతలో జిల్లాలోని సుల్తానాబాద్, పెద్దపల్లి, ధర్మారం, మంథని మండల కేంద్రాలను ఎంపిక చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తారు. ఇందుకోసం ఇప్పటికే నాలుగు స్వశక్తి మహిళా సంఘాలను ఎంపిక చేశారు.

టీ, టిఫిన్లతోపాటు భోజనం..

- మహిళా శక్తి క్యాంటీన్లలో టీ, టిఫిన్లతోపాటు భోజనం కూడా అందించాలని నిర్ణయించారు.
- శుచి, శుభ్రత, నాణ్యత, క్వాలిటీ, క్వాంటిటీపై ప్రత్యేక దృష్టి సారించారు.
- ప్రభుత్వ భవనంలోనే మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేస్తారు.
- మహిళా సంఘం సభ్యులకు ఉచితంగానే భవనం కేటాయిస్తారు.
- జిల్లాలో నాలుగు స్వశక్తి సంఘాల సభ్యులు ఎంపికవగా గతనెల 19 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో వారికి శిక్షణ ఇచ్చారు.

పెట్టుబడి రూ.20 లక్షల వరకు

ఒక్కో క్యాంటీన్ ఏర్పాటుకు సామర్థ్యాన్ని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెట్టుబడి వస్తుందని డీఆర్డీవో అధికారులు అంచనా వేశారు. ఈ సొమ్మును బ్యాంకుల నుంచి రుణాలుగా ఇప్పిస్తారు. ప్రతినెలా సులభ వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించారు.

మండల కేంద్రాల్లో ఏర్పాటు..

గ్రామీణులు వివిధ పనుల కోసం మండల కేంద్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, షాపింగ్‌లకు వచ్చి వెళ్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం వారికి ఆహార పదార్థాలు సక్రమంగా అందడంలేదు. ఒకవేళ అందుబాటులో ఉన్నా నాసిరకం, అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లను జిల్లాలోని సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని, ధర్మారం తోపాటు గోదాములు, రైస్ మిల్లులు, పరిశ్రమలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు.

క్యాంటీన్లు ఏర్పాటు చేసే ప్రాంతాలు

ప్రాంతం	సంఖ్య
సుల్తానాబాద్	1
పెద్దపల్లి	1
ధర్మారం	1
మంథని	1

మహిళా సంఘాల సమాచారం

గ్రామైక్య సంఘాలు	450
స్వశక్తి సంఘం సభ్యులు	1,20,000
మహిళా సంఘాలు	10,589

శిక్షణ పొందిన



మహిళా క్యాంటీన్ నిర్వహణ కోసం అధికారులు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. టీ నాణ్యత చేయడం ఎలా, టిఫిన్‌లో నాణ్యత, శుభ్రత ఎలా చేయాలి? భోజనం వండితే కూరగాయలలో పరిమాణం ఎలా ఇవ్వాలి? అనే దానిపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్ ఇచ్చారు.

– అనిత, క్యాంటీన్ నిర్వాహకురాలు, సుల్తానాబాద్

త్వరలో ప్రారంభిస్తాం



జిల్లాలో త్వరలోనే నాలుగు క్యాంటీన్లు ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం పనులు పూర్తిచేశాం. క్యాంటీన్ నిర్వహణకు ఎంపికైన మహిళా సంఘాల సభ్యులకు ఇప్పటికే శిక్షణ ఇప్పించాం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందిన వెంటనే క్యాంటీన్లు ప్రారంభిస్తాం. పల్లెప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందిస్తాం.

– రవికుమార్, డీఆర్డీవో, ఏపీడీ

మైనారిటీల అభ్యున్నతికి కృషి



మసీదు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

రామగుండం: ముస్లింల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలో నిర్మించిన మసీదు ఏ-ఉమర్ ఫరూఖ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముస్లిం మతపెద్దలతోపాటు స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిరిశెట్టి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌బెల్ట్‌లో క్రీడలకు పెద్దపీట

గోదావరిఖని: కోల్‌బెల్ట్ ప్రాంతంలో క్రీడలకు పెద్దపీట వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయులు, సింగరేణి అధికారుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణితో సమన్వయం చేసుకుంటూ నగరాన్ని 'రుడా'గా మార్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య, కవ్వంపల్లి స్వామి, సీఎంవోఏఐ అధ్యక్షుడు పొనుగోటి శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ప్రెస్‌క్లబ్ ప్రసిడెంట్ పూదరి కుమార్, కార్యదర్శి శ్యాంసుందర్, సింగరేణి ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, సివిల్ అధికారి వరప్రసాద్, సాయిప్రసాద్, క్రాంతి కుమార్, సీనియర్ పీవోలు సారంగపాణి, హనుమంతరావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేశ్, కోఆర్డినేటర్ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో సింగరేణి జట్టు విజేతగా నిలిచింది.

కార్మికులను మోసం చేస్తున్న సర్కార్

- సింగరేణి నికర లాభాల్లోంచి 33 శాతం వాటా చెల్లించాలి
- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్



నల్లకండువా ధరించి నిరసన దీక్ష చేపట్టిన కొప్పుల ఈశ్వర్, హాజరైన నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచనకు గురిచేస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలోని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కేంద్ర కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సింగరేణి నిరాహారదీక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. సింగరేణి సాధించిన వాస్తవ లాభాల్లో 33శాతం వాటాను కార్మికులకు చెల్లించకుండా కేవలం 16.9శాతమే చెల్లించి దగా చేసిందని ధ్వజమెత్తారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మీడియా సమావేశంలో ప్రకటించినట్లు లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి రూ.4,701కోట్ల నికర లాభాలు వస్తే, రూ.2,289కోట్లు సంస్థ అభివృద్ధి, నూతన గనుల కోసం కేటాయించి, రూ.2,412 కోట్ల లాభాలు చూపిస్తూ అందులో 33శాతం కార్మికులకు పంచడం అన్యాయమన్నారు. వాస్తవ లాభాల్లో 33 శాతం చెల్లిస్తే రూ.1,551కోట్లు కార్మికులకు అందుతుందని వివరించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు.

పోలీసుల ఓవరాక్షన్

సింగరేణి వాస్తవ లాభాల్లో వాటా కోసం నిరసన దీక్ష చేస్తే పోలీసులు ఓవరాక్షన్ చేశారని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఇలాంటి అధికారులు తగిన మూల్యం చెల్లించుకుంటారని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమకారులుగా పోరాటం చేస్తూనే ఉంటామని ఆయన తెలిపారు. చెన్నూరు ఏరియాలో కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెరువు మత్తడిని సింగరేణి జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చివేస్తున్నారని ఆయన ఆరోపించారు. వారికి సింగరేణి జిలెటిన్‌స్టిక్స్ ఎలా వచ్చాయని సుమన్ ప్రశ్నించారు. దీనిని ఎందుకు బయట పెట్టడం లేదని ఆయన నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, పుట్ట మధూకర్, చిన్నయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు మాదాసు రామ్మూర్తి, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ రూట్‌మార్చ్ .. ఆకట్టుకున్న ప్రదర్శన



పట్టణ వీధుల్లో ఆర్‌ఎస్‌ఎస్ రూట్‌మార్చ్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్(ఆర్ఎస్ఎస్) జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రూట్‌మార్చ్ కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రత్యేక వాయిద్యాలతో ప్రతినిధులు క్రమశిక్షణతో ముందుకు సాగారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ప్రారంభిక్ శిక్షవర్గ ముగింపు కార్యక్రమానికి జాగృతి ఎడిటర్ కుర్ర దుర్గారెడ్డి హాజరై మాట్లాడారు. హిందువులు సంఘటితంగా ఉంటేనే దేశం మనుగడ సాధిస్తుందన్నారు. అందుకోసమే వందేళ్ల క్రితం డాక్టర్ హెగ్డేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్‌ను స్థాపించారని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు కొంపాల రాజన్న, మల్లోజుల కిషన్‌జీ, గడ్డి రమేశ్, రామగిరి శ్రీనివాస్, ప్రయాకరావు, నాగరాజు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, పుట్ట సదయ్య, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, శివంగారి సతీశ్, బెజ్జంకి దిలీప్‌కుమార్, వియ్యంకార్‌సాయి తదితరులు ఉన్నారు.

నార్కోటిక్స్ జాగిలం.. పోలీసులకు ప్రత్యేకం

- మాదకద్రవ్యాలను పసిగట్టే శునకాలు
- గంజాయి నియంత్రణకూ వినియోగం
- పేలుడుపదార్థాల గుర్తింపులోనూ పోలీసు జాగిలాల ప్రత్యేకత
- పోలీస్ డ్యూటీ మీట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జాగిలాలు



వాసన ద్వారా గంజాయిని గుర్తిస్తున్న జాగిలం



కాళేశ్వరం జోన్‌లో యాక్టివ్‌గా ఉన్న జాగిలాలు

గోదావరిఖని: పేలుడు పదార్థాల గుర్తింపుతోపాటు గంజాయి, మాదకద్రవ్యాలు పసికట్టడంలో జాగిలాలు తమకంటూ ప్రత్యేకత చాటుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గంజాయితోపాటు మాదకద్రవ్యాల నియంత్రణపై దృష్టి సారించింది. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. డ్రగ్స్ నియంత్రణలో విశేష కృషి చేసిన అధికారులకు రివార్డు కూడా అందజేయాలని పోలీసుశాఖకు సూచించారు. ఈక్రమంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం పోలీస్ డాగ్స్‌ను రంగంలో దించారు. ఇప్పటివరకు కమ్యూనిటీ పోలీసింగ్, ఆకస్మిక తనిఖీల్లో పోలీసులు పాల్గొంటున్నారు. ప్రస్తుతం ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్స్‌ను తనిఖీల కోసం రంగంలోకి దింపుతున్నారు. దీనికోసం జిల్లాకో పోలీస్‌డాగ్‌ను కేటాయించి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కొద్దిరోజులుగా అయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ పోలీసింగ్ తనిఖీల్లో కూడా గంజాయిని గుర్తించే పనిలో జాగిలాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇప్పటివరకు పేలుడుపదార్థాల తనిఖీ వరకే పరిమితమైన డాగ్స్ పాత్ర.. గంజాయిలాంటి మత్తు పదార్థాల గుర్తింపు కోసం వినియోగిస్తుండటంతో అందరి దృష్టి వాటిపై పడింది. ఇటీవల కాళేశ్వర్ జోనల్ స్థాయి డ్యూటీ మీట్‌లో జాగిలాల ప్రదర్శన ఆకట్టుకుంది. నేరస్తులను గుర్తించడం, పేలు పదార్థాలను గుర్తుపట్టడం, ల్యాండ్‌మైన్స్‌ను పసిగట్టడం, గంజాయి, ఇతర మత్తుపదార్థాల ఆచూకీ కనుకొనడం లాంటి పోటీల్లో సత్తా చాటాయి. కాళేశ్వరం జోన్‌లో తొమ్మిది డాగ్స్ ఉండగా, జిల్లాకో నార్కోటిక్ డాగ్‌ను పోలీసు అధికారులు కేటాయించారు.

వాసనతో గుర్తింపు..

జాగిలాలు తరచుగా ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్, బోర్డర్ చెక్‌పోస్టులు.. మొదలైన వాటి వద్ద మాదకద్రవ్యాల రవాణాను కనుగొనడానికి ఉపయోగిస్తున్నారు. ఇందులో జాగిలాలు వాసనల ద్వారా డ్రగ్స్‌నూ పసిగడుతున్నాయి.

బాంబ్ డిటెక్షన్ డాగ్స్

జాగిలాలను పేలుడు పరికరాలలో ఉపయోగించే పదార్థాల గుర్తింపు కోసం వినియోగిస్తున్నారు. వీటిని శోధించడానికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. బాంబు పేలవచ్చు.. కాబట్టి ఆ ప్రాంతాన్ని డిస్టర్బ్ చేయకూడదని కుక్కకు తెలుసు. కాబట్టి అది బాంబు ఉనికిని గుర్తించి సమాచారం ఇస్తుంది. ఇటువంటి కుక్కలు ప్రభుత్వ ఉన్నతాధికారులు వస్తున్న క్రమంలో, విమానాశ్రయాలు, నేరస్థలాల వద్ద భద్రతా సిబ్బందికి సహాయ పడుతున్నాయి.

క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ డాగ్స్

- రక్తం, తుపాకీ లేదా నేర ప్రాంతంలో విడిచిపెట్టిన వస్తువులతో సహా ట్రేస్ ఎవిడెన్స్ కోసం నేర ప్రాంతాలను శోధించడానికి, పరిశోధనకు అదనపు సాక్ష్యాలను సేకరించడానికి జాగిలాలను వినియోగిస్తారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటిన సింబ

- రామగుండం కమిషనరేట్‌కు చెందిన సింబ అనే జాగిలం జాతీయ స్థాయిలో సత్తా చాటింది. జార్కండ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి నార్కోటిక్ ఇన్వెస్టిగేషన్‌లో దేశంలోని అన్ని విభాగాలకు చెందిన డాగ్స్ పాల్గొన్నాయి. ఇందులో సింబ మత్తుపదార్థాల గుర్తింపులో తనదైన శైలిలో ముందుకు సాగి దేశస్థాయిలో నాలుగోస్థానం సాధించింది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడి దుర్మరణం


లక్ష్మయ్య(ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అందుగులపల్లి వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో వేముల లక్ష్మయ్య(58) అక్కడికక్కడే మరణించగా.. ఆయన భార్య మల్లీశ్వరికి గాయాలయ్యాయి. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం తన భార్య మల్లీశ్వరితో కలిసి దేవునిపల్లి శ్రీలక్ష్మీనరసింహుడి దర్శనానికి బయలుదేరాడు. అందుగులపల్లి స్టేజీ వద్ద రోడ్డు దాటబోతుండగా.. వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య అక్కడికక్కడే మరణించగా.. మల్లీశ్వరికి గాయాలయ్యాయి. మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్రమాదవశాత్తు జారి పడి యువకుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లోని రైస్ మిల్ అసోసియేషన్ వద్ద ఆదివారం కిరాణం దుకాణంపై నుంచి జారి పడి పూసాలకు చెందిన కంకణాల శ్రావణ్‌కుమార్(30) అనే యువకుడు మృతిచెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. వెల్డింగ్ షాపులో పని చేస్తూ జీవిస్తున్న శ్రావణ్‌కుమార్ మద్యం మత్తులో కిరాణం దుకాణంపైకి ఎక్కగా.. కాలు జారి పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి..

ఓదెల: పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధి కనగర్తి గ్రామంలోని దానకుంట చెరువులో ఇదే గ్రామానికి చెందిన పెరుక మొండయ్య(65) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడు. పొత్కపల్లి హెడ్ కానిస్టేబుల్ కిషన్ వివరాల ప్రకారం.. మొండయ్య అనే వ్యక్తి మద్యం తాగిన మత్తులో శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బహిర్భూమికి వెళ్లి కాలు జారి చెరువులో పడి మృతిచెందాడు. మృతుడి కుమార్తె దుబాసి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ..

మానకొండూర్: మండలంలోని కెల్లెడ గ్రామానికి చెందిన కాట వెంకటేశ్ (35) ఇటీవల గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కెల్లెడకు చెందిన వెంకటేశ్ తండ్రి మల్లయ్య నాలుగునెలల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి తండ్రి లేడనే బాధతో వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 4న గడ్డిమందు తాగగా, కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

సిరిసిల్లఅర్బన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిరిసిల్ల పట్టణం పెద్దూరులోని కేసీఆర్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం.. కేసీఆర్‌నగర్‌కు చెందిన సిరిమల్ల రాములు– రేణుక దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ముగ్గురు కొడుకులు సంతానం. కూతుళ్లు, ఇద్దరు కొడుకులకు పెళ్లిళ్లు జరిగి వేరే ఉంటున్నారు. అందరికంటే చిన్నవాడైన సిరిమల్ల శ్రీధర్ (34) ఇంటర్ వరకు చదివి సాంచాలు నడుపుకుంటూ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ మధ్య కాలంలో సాంచాల పని బందు కావడంతో చేతిలో డబ్బులు లేక తీవ్ర మనస్తాపం చెందాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టుకుచ్చుల సాగు.. లాభాలు బాగు

- బతుకమ్మలకే ప్రత్యేకం
- 90 రోజుల పంట.. ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం
- సింగరేణి బెల్టుతోపాటు హైదరాబాద్ వరకు సరఫరా
- అంతర పంటగా అదనపు ఆదాయం
- జిల్లావ్యాప్తంగా సాగు


జూలపల్లి మండలంలోని పెద్దాపూర్‌లో సాగు చేసిన పట్టుకుచ్చుల తోట

జూలపల్లి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే, చిన్నాపెద్దా తేడా లేకుండా మహిళలు ఇష్టంగా ఆడిపాడే అచ్చ తెలుగు తెలంగాణ పండుగ బతుకమ్మ పండుగ. ఈ పండుగకు ముఖ్యమైన పూలు.. బతుకమ్మలకు వన్నె తెచ్చే పూలు.. బతుకమ్మ కోసమే ప్రత్యేకంగా సాగు చేసే పూలే పట్టుకుచ్చులు(ఫిలోషియా). విత్తన ఖర్చులుండవు. ఎక్కువ నీరు అవసరముండదు. రసాయన ఎరువులు తక్కువే. కూలీల ఖర్చు లేని పంట. అన్నదాతలకు అతి తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం తెచ్చే పంట. పట్టుకుచ్చుల సాగు జిల్లావ్యాప్తంగా రానురానూ పెరుగుతోంది. గతంలో గుట్టలు, అడవుల్లో దొరికే తంగేడు, గునుగు పూలతో పేర్చిన బతుకమ్మలను మహిళలు ఆడుకునేవారు. రానురానూ బతుకమ్మ పండుగలో కూడా ఆధునికత చోటుచేసుకోవడంతో.. పూలను తక్కువ సమయంలో సాగు చేసేలా విత్తనాలు తయారు చేసి తోటలు పెంచి అమ్ముతున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ పట్టుకుచ్చుల సాగును రైతులు చేస్తున్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో అత్యధికంగా 14 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నట్లు అంచనా . కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు మండలాల్లో సైతం పట్టుకుచ్చుల సాగు చేస్తున్నారు. ప్రతి ఆగస్టులో మొదలయ్యే పంట అక్టోబర్ రాగానే బతుకమ్మ పండుగకు వారం ముందే కోసి కట్టలు కట్టి అమ్ముతున్నారు.

20 ఏళ్లుగా..

పెద్దాపూర్లో రైతులు 20 ఏళ్లుగా సీజన్‌లో అంతర పంటగా సాగు చేస్తూ మంచి లాభాలు సాధిస్తున్నారు. పట్టుకుచ్చుల పూలకున్న డిమాండును చూసి ఇప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగు చేస్తూ బతుకమ్మలకు వన్నె తెస్తున్నారు.

కట్టలు కట్టి..

కరీంనగర్, గోదావరిఖని, మంచిర్యాల, సిద్దిపేట నుంచి వ్యాపారులు వచ్చి తోటలను గుత్తగా మాట్లాడుకుంటారు. టెంట్లు వేసి కూలీలతో కట్టలు కట్టించి పట్టణాలకు తరలించి అమ్ముతున్నారు. దీంతో వ్యాపారులు, కూలీలు, సాగు చేసిన రైతులకు లాభాలు వస్తున్నాయి.

90 రోజుల పంట

పట్టుకుచ్చులు సాగు చేసిన 90 రోజుల్లోనే కోతకు వస్తాయి. పెట్టుబడి తక్కువతోపాటు కూలీల ఖర్చులు, శ్రమ లేని పంట కావడంతో రైతులు పట్టుకుచ్చుల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పామాయిల్, పత్తి పంటల్లో కూడా అంతర పంటగా సాగు చేసుకోవచ్చని ఉద్యానవన శాఖ అధికారులు అంటున్నారు. పూలు ముద్దగా ఉండగా.. కొంతవరకు గొంగళి పురుగు, మెడవిరుపు రాకుండా ముందు జాగ్రత్తగా మందులు పిచికారీ చేయాల్సి ఉంటుందని రైతులంటున్నారు. రైతులు తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆదాయం తెచ్చే పూల సాగుపై దృష్టి పెట్టాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

20 గుంటల్లో సాగు



20 గుంటల్లో పట్టుకుచ్చుల సాగు చేస్తున్నా. రూ.40వేల వరకు ఆదాయం వస్తోంది. పట్టణాల నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడే కూలీలతో కట్టలు కట్టించి సింగరేణి ప్రాంతాలతోపాటు పట్టణాల్లో విక్రయించేందుకు తీసుకెళ్తారు.

– పెసరు లచ్చయ్య, మాజీ ఉప సర్పంచ్, పెద్దాపూర్

బతుకమ్మలకు వన్నె తెస్తాయి



పట్టుకుచ్చుల పూలు బతుకమ్మలకు వన్నె తెచ్చి అందంగా కనిపిస్తాయి. ప్రతి ఏడాది బతుకమ్మలో పట్టుకుచ్చులు పేర్చి ఆడుతాం. ప్రతి బతుకమ్మలో పట్టుకుచ్చుల పూలు తప్పక ఉంటాయి.

– అమరగాని అనూష, జూలపల్లి

అంతర పంటగా సాగు



పట్టుకుచ్చుల పూలను పామాయిల్ తోటల్లో సాలు మధ్యలో, పత్తి పంటలో అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. బతుకమ్మ పండుగకు మంచి డిమాండ్ ఉంటుంది కాబట్టి లాభాలు కూడా వస్తాయి. రైతులు ప్రతి ఆగస్టు మాసంలో విత్తనాలు నారుగా పెంచి నాటుకోవచ్చు.

– ఎ.జ్యోతి, ఉద్యానవన అధికారి, పెద్దపల్లి

మావంతు సహకారమందిస్తాం



రైతులు అంతర పంటలుగా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలిచ్చే పట్టుకుచ్చులను సాగు చేస్తే మావంతు సహకారమందిస్తాం. సస్య రక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి సూచనలందిస్తాం. రైతులు అధిక ఆదాయాన్నిచ్చే వాణిజ్య పంటల సాగు వైపు దృష్టి పెట్టాలి.

– తంబ ప్రత్యూష, మండల వ్యవసాయాధికారి, జూలపల్లి

నేతకు ఊతం


చేనేత స్టాళ్లు


ఆకట్టుకుంటున్న చేనేత స్టాల్స్

- కట్టిపడేస్తున్న రంగుల వస్త్రాలు
- ఆకట్టుకుంటున్న ప్రత్యేక స్టాళ్లు
- ప్రదర్శనలో పలు రాష్ట్రాల ఉత్పత్తులు
- కొనుగోలుదారుల్లో పెరిగిన ఆసక్తి

కోల్‌సిటీ: చేనేత వస్త్రంపై మనసు పడని మగువలెవరూ ఉండరు. అందం.. హూందాతనం కలగలిపిన ఆధునిక సొబగులద్దుకుంటున్న సంప్రదాయ హస్తకళను గోదావరిఖని ప్రాంతవాసులకు చేరువ చేసేందుకు కళాసిల్క్ సంస్థ శ్రీకారం చుట్టింది. ఆర్జీ–1 జీఎం ఆఫీస్ సమీపంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్లో చేనేత వస్త్ర, హస్తకళ ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను సంస్థ ఏర్పాటు చేసింది. నేతన్నలకు ఆర్థికంగా చేయూత అందించడంతోపాటు చేనేత హస్తకళను ప్రతి ఇంటికీ చేర్చేందుకు సంస్థ నిర్వాహకులు కృషి చేస్తున్నారు. దేశంలో ఎంపికైన చేనేత కళాకారులు అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి.

ఎగ్జిబిషన్‌లో పలు రాష్ట్రాల ఉత్పత్తులు

తెలంగాణలోని గద్వాల్, నారాయణపేట, పోచంపల్లి, ఏపీలోని ధర్మవరం, వెకంటగిరి, మంగళగిరి, కంకారి, ఉప్పడ, అస్సాంలోని మూగా, ఎరిశిల్క్, బీహార్‌లోని బాగల్పుర శిల్క్స్, టస్సర్, ఛత్తీస్‌గఢ్‌లోని ట్రిబిల్ వర్క్స్, కోసా శిల్క్, గుజరాత్‌లోని బాందని, కచ్చ ఎంబ్రెడరీ డ్రెస్, శారీస్, జమ్మూ, కాశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ శారీస్, డ్రెస్ మెటీరియల్, పాష్మిక్ శాల్, కర్ణాటకలోని క్రేప్, ప్రింటెండ్ శారీస్, మధ్యప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరి, రాజస్థాన్‌లోని కోటా, బంధాని, బ్లాక్ ప్రింట్, సంగ్నరి ప్రింట్, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్‌తోపాటు హరియానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నో కుర్తీస్, డోర్ కర్టెన్స్ తదితర రాష్ట్రాల హ్యాండీ క్రాఫ్ట్స్, న్యూట్రీషన్ ఫుడ్ విక్రయిస్తున్నారు.

చేనేత, హస్తకళలను ఆదరించండి



చేనేత వస్త్రాలు, హస్తకళలు, హ్యాండ్‌లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్‌ను ఆదరించండి. చేనేత కళాకారులు అల్లికలతో తయారు చేసిన సిల్క్, కాటన్ వస్త్రాలు అద్భుతంగా ఉన్నాయి. దసరా పండగ కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల కళాకారులు తయారు చేసిన వస్త్రాలు ఒకేచోట లభించేలా గోదావరిఖనిలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాం. సద్వినియోగం చేసుకోండి. నేతన్నలకు చేయూతనందించడానికి ముందుకురండి.

– బిజు మండల్, ఎగ్జిబిషన్ మేనేజర్

బీటెక్ విద్యార్థి మృతితో ఖనిలో విషాదం


మృతిచెందిన అభినయ్

గోదావరిఖని: ఉన్నత చదువుల కోసం వెళ్లిన బీటెక్ విద్యార్థి నీటి ప్రమాదంలో మృతిచెందడంతో గోదావరిఖనిలో విషాదం నెలకొంది. స్థానిక శారదానగర్‌కు చెందిన బండారి అభినయ్(18) ఆదివారం ములుగు జిల్లాలోని కొంగల వాటర్ ఫాల్స్‌లో జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. తండ్రి బండారి శ్రీనివాస్ ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్‌లో ఫోర్‌మెన్‌గా పని చేస్తుండగా.. అభినయ్ హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ట్రిపుల్‌ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం తన స్నేహితులతో ముందుగా బొగత జలపాతానికి వెళ్లారు. అప్పటికే సమయం మించిపోవడంతో సందర్శకులను నిలిపివేశారు. ఆ తర్వాత అక్కడే స్నేహితులతో బస చేసి ఆదివారం ఉదయమే నిషేధిత ప్రాంతమైన కొంగల వాటర్ ఫాల్స్ దొనపాటి లొద్దిలోకి స్నానం చేసేందుకు వెళ్లారు. లోతైన జలపాతంలోకి వెళ్లిన ఇతడు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు సంఘటన ప్రాంతానికి వెళ్లారు.

దసరాకు ఊరెళ్తున్నారా?

- ముందస్తు జాగ్రత్తలతోనే చోరీల నివారణ
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మేలు
- టూర్‌ప్లాన్, లొకేషన్స్ షేర్ చేయొద్దు



గోదావరిఖని: దసరా పండుగకు సరదాగా ట్రిప్పు ప్లాన్ చేస్తున్నారా? పని చేస్తున్న ప్రాంతాన్ని వదిలి సొంత ఊరు వెళ్తున్నారా? వెళ్లేముందు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం వరుసగా సెలవులు రావడంతో చాలా కుటుంబాలు తమ సొంత ఊళ్లకు పయనమయ్యాయి. ఇదే అదనుగా దొంగలు రెచ్చిపోయే ప్రమాదముంది. ఆరుగాలం శ్రమించి దాచుకున్న సొమ్ము వారి పాలయ్యే అవకాశముంది. ఈక్రమంలో ఊరుకు వెళ్లే కుటుంబాలు పలు సూచనలు పాటించాలని కోరుతున్నారు. తాళం వేసిన ఇళ్ల చిరునామా పోలీసులకు చెబితే ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ ఎక్కువగా నిర్వహించే అవకాశం ఉంది. తద్వారా దొంగల కట్టడికి అవకాశం ఉంటుంది.

పాటించాల్సిన సూచనలివే..

- బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోండి. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి. బీరువా తాళాలను ఇంట్లో, ఇతరులకు అందుబాటులో ఉంచరాదు.
- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్లు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- తప్పనిసరిగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి.
- మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా వీల్స్‌లాక్, చైన్స్‌తో పోల్స్, చెట్లకు లాక్ వెయ్యడం మంచిది.
- నమ్మకమైన వ్యక్తులను, వారి మొబైల్ నంబర్లు, ఆధార్ కార్డు వివరాలు, వారి గురించి పూర్తి వివరాలు తెలుసుకొని వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డ్, సర్వెంట్‌ను నియమించుకోండి.
- స్వీయ రక్షణకు మీ ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలి. రూ.వెయ్యికి ఆన్‌లైన్‌లో సీసీ కెమెరాలు లభిస్తున్నాయి.
- పక్కింటి వారికి పరిసరాలను గమనించాలని చెప్పాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా కర్టెన్ వేయాలి. ఇంటిముందు, ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.
- ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలి. ఇంటిముందు చెత్తాచెదారం, న్యూస్ పేపర్స్, పాల ప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి. వాటిని కూడా గమనించి దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంది.
- అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి. లేదా డయల్ 100 నంబరుకు కాల్ చేయండి.

ప్రజల సహకారంతో నివారణ



ప్రజల సహకారంతోనే చోరీలను నివారించవచ్చు. ఊరుకు వెళ్లే సమయంలో పోలీసుల సూచనలు, సలహాలను పాటించాలి. కచ్చితంగా పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వండి. ఆ ఏరియాలో పెట్రోలింగ్ పెంచే అవకాశం ఉంటుంది. అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే డయల్ 100 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వండి. ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే అదనపు రక్షణ ఉంటుంది.

– పోలీసు కమిషనర్, రామగుండం

దాతలూ.. దయచూపండి

- క్యాన్సర్‌తో పోరాడుతున్న గల్ఫ్ బాధితుడు
- రూ.10 లక్షలు కావాలంటున్న వైద్యులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


దాతలు సాయం చేయాలని వేడుకుంటున్న కుటుంబ సభ్యులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన గల్ఫ్ బాధితుడు నలిమేటి శంకర్ క్యాన్సర్‌తో పోరాడుతున్నాడు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేదని, దాతలు సాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. వివరాలు.. ఉన్న ఊరిలో ఉపాధి లేక అప్పు చేసి బతుకుదెరువు కోసం శంకర్ దుబాయ్ వెళ్లాడు. అక్కడ చాలీచాలని జీతంతో కంపెనీలో పనిచేస్తూ భార్య పిల్లలను సాదుకొని మెరుగ్గా జీవిస్తామనే ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది. శంకర్‌కు అనూహ్యంగా ఎడమ దవడకు గడ్డ అయ్యింది. అక్కడే వైద్యం చేయించుకున్నా ఎంతకూ తగ్గలేదు. 2023 జూన్‌లో ఇంటికి వచ్చిన తర్వాత ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా క్యాన్సర్ గడ్డగా నిర్ధారణ అయింది. శంకర్ భార్య సుశీల అంగన్‌వాడీ కార్యకర్త. ఎలాగైనా భర్తను బతికించుకోవాలని తనకు వచ్చే చిన్నపాటి జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ రూ.5 లక్షల వరకు అప్పు చేసి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయిస్తుంది. ఇంకా మెరుగైన చికిత్స అందిస్తే కోలుకునే అవకాశం ఉంటుందని, అందుకు రూ.10 లక్షల మేర ఖర్చు అవుతాయని వైద్యులు సూచించారు. శంకర్‌పై బెంగతో అతడి తల్లి ముత్తవ్వ ఇటీవలే చనిపోయింది. శంకర్‌కు అయ్యే ఖర్చులు భరించలేక అతడి కుమారుడు హరిహరణ్, కూతురు శ్రీనిధి చదువులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి. 'మా నాన్నను ఎలాగైనా కాపాడండి' అంటూ పిల్లలు వేడుకుంటున్నారు. ప్రభుత్వం, దాతలు మానవత దృక్పథంతో ఆదుకోవాలని కోరుతున్నారు.

సాయం చేయాల్సిన దాతలు..

నలిమేటి శంకర్
అకౌంట్ నంబర్ 79030435804
IFSC CODE: SBIN0RRDCGB
తెలంగాణ గ్రామీణ బ్యాంకు
వీర్నపల్లి శాఖ.
ఫోన్ పే/ గూగుల్ పే
95027 30814

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని బూజునూరు గ్రామ చెరువులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు.. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు బతుకమ్మ చెరువు సమీపం నుంచి వెళ్తుండగా చెరువులో మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయాడా, ఎవరైన హత్య చేసి పడేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడు చామన ఛాయ రంగులో ఉన్నాడని, కుడిచేతికి స్టీల్ కడెం, బ్లూ కలర్ ఫుల్‌టీషర్ట్ ధరించి ఉన్నాడని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 70778 నంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

శరణు శరణు రాజన్న

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధికి ఆదివారం భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి క్యూలైన్లు, కౌంటర్లను తనిఖీ చేశారు. ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. కాగా దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రాజన్న సన్నిధిలో అమ్మవారు కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

సింగరేణిలో తగ్గిన బొగ్గు ఉత్పత్తి

- రెండో త్రైమాసికంలో పడిపోయిన వైనం
- భారీ వర్షాలతో ఓసీపీల్లోనూ ఇదే పరిస్థితి


ఓసీపీ-3 కోల్‌క్వారీలోకి వస్తున్న వర్షపు నీరు(ఫైల్)

ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి(లక్షల టన్నుల్లో..)

ఏరియా	లక్ష్యం	సాధించింది	శాతం
ఆర్జీ–1	23.11	19.99	86
ఆర్జీ–2	36.11	39.34	109
ఆర్జీ–3	29.25	27.48	94
ఏపీఏ	3.29	3.09	94
భూపాలపల్లి	19.03	12.75	67
కొత్తగూడెం	65.04	60.40	93
ఇల్లెందు	16.97	19.93	117
మణుగూరు	58.64	51.96	89
బెల్లంపల్లి	16.90	14.50	86
మందమర్రి	17.83	13.87	78
శ్రీరాంపూర్	29.68	21.13	71

గోదావరిఖని: భారీ వర్షాలు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపించాయి. రెండో త్రైమాసికంలో అధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి పడిపోయింది. గత నెలలో 159 మి.మీ. వర్షపాతం నమోదైంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా సింగరేణి నిర్దేశించుకుంది. రెండో త్రైమాసికంలో 31.59 మిలియన్ టన్నుల లక్ష్యానికి 28.45 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. గతనెలలో 94 శాతంలో ఉండగా, ఈసారి నాలుగు శాతం ఉత్పత్తి తగ్గి 90 శాతం నమోదు చేసింది. సంస్థలో 17 ఓపెన్‌కాస్ట్ గనులు, 22 భూగర్భ గనులు ఉన్నాయి. ఓసీపీల ద్వారా 28.47 మిలియన్ టన్నుల లక్ష్యానికి 25.98 మిలియన్ టన్నులు సాధించింది. అలాగే భూగర్భ గనుల ద్వారా 31.27లక్షల టన్నులకు 24.74 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాయి. భారీ వర్షాలతో ఓసీపీల్లోని హాలేజీ రోడ్లు శిథిలమై క్వారీల్లోకి నీళ్లు చేరడంతో ఉత్పత్తి నిలిచిపోయింది.

ముందంజలో రెండు ఏరియాలు ..

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో గడిచిన ఐదు నెలల్లో సంస్థ వ్యాప్తంగా రెండు ఏరియాలు అగ్రగామిగా నిలిచాయి. మణుగూరు ఏరియా 117 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, ఆర్జీ–2 ఏరియా 109 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి రెండోస్థానంలో నిలిచింది. భూపాలపల్లి ఏరియా 67 శాతం ఉత్పత్తితో చివరి స్థానంలో నిలిచింది.

2024–25 బొగ్గు ఉత్పత్తి లక్ష్యం(మిలియన్ టన్నుల్లో)	72
సెప్టెంబర్ టార్గెట్(మిలియన్ టన్నుల్లో)	31.58
సాధించింది(మిలియన్ టన్నుల్లో)	28.44
నమోదైన శాతం	90
వర్షపాతం(మి.మీ.లలో)	159
గనులవారీగా..	
ఓసీపీ	17
టార్గెట్(మిలియన్ టన్నుల్లో)	28.47
సాధించిన ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)	25.98
భూగర్భ గనులు	22
టార్గెట్(మిలియన్ టన్నుల్లో)	31.27
సాధించిన ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)	24.74